క్లుప్తంగా

నేడు ముత్యాలమ్మ పండుగ

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని పాత నేరేడుచర్లలో శుక్రవారం ముత్యాలమ్మ పండుగ నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని దేవతల విగ్రహాలు, ఆలయాలు, బొడ్రాయిని రంగులు వేసి ముస్తాబు చేశారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



అర్చనకు బాబా శేషవస్త్రం అందజేస్తున్న పాలక మండలి సభ్యులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని సాయిబాబా ఆలయంలో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి మారుతిప్రసాద్ సతీమణి అర్చన గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు పాలకమండలి సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం బాబావారి శేషవస్త్రం, తీర్థ పసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్టీయూ కమిటీ ఎన్నిక



కె.వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు



సత్తూరి భిక్షం, ప్రధాన కార్యదర్శి

మునగాల : మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) మండల కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓరుగంటి నాగేశ్వరరావు, బంధం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. వారి సమక్షంలో సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా నాయకుడు ఎర్ర అంజన్‌రెడ్డి తెలిపారు. మండల శాఖ అధ్యక్షుడిగా కంచుగంటి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా సత్తూరి భిక్షం ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.

చిలుకూరు మండల అధ్యక్షుడిగా అంకిరెడ్డి



చిలుకూరు : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగిరెడ్డి అంకిరెడ్డి ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంకిరెడ్డి నియామకం పట్ల చిలుకూరు జెడ్పీహెచ్‌ఎస్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గుండు ఆదినారాయణ, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం మండల ప్రధాన కార్యదర్శి సురగాని లింగయ్య, జిల్లా, నాయకులు, తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

హుజూర్‌నగర్ ప్రధాన కార్యదర్శిగా మాభాష

హుజూర్‌నగర్ : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం తెలంగాణ (ఎస్‌టీయూ టీఎస్) మండల ప్రధాన కార్యదర్శిగా ఎస్కే మాభాషను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.నాగేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన నియామకం పట్ల సంఘం నాయకులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

డబ్బులు ఇవ్వాలని బెదిరింపులు

కోదాడ: కోదాడకు చెందిన ఇద్దరు వ్యక్తులు తాము యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధులుగా చెప్పుకుంటూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. సూర్యాపేట సమీపంలోని బాలెంలో ప్రతి బుధవారం జాతకాలు చెప్పుకుంటూ, తాయత్తులు కడుతూ జీవించే వారి వద్దకు సామాన్యుడిలా వెళ్లి అక్కడ జరిగే వ్యవహారాన్ని రహస్యంగా చిత్రీకరించినట్లు సమాచారం. ఆ వీడియోలను అడ్డుపెట్టుకొని సదరు జాతకం చెప్పే వ్యక్తులకు ఫోన్ చేసి వీడియోలు బయటకు రాకుండా ఉండాలంటే రూ.50వేలు ఇవ్వాలని బెదిరించినట్లు తెలిసింది. దీంతో తాను అంత డబ్బు ఇచ్చుకోలేనని సదరు జాతకం చెప్పే వ్యక్తి ఆ ఫోన్‌కాల్‌ను రికార్డు చేసి సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో పాటు సూర్యాపేటరూరల్ పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఇటీవల కొందరు కోదాడ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. ఇలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని పోలీసులకు చెప్పినట్లు సమాచారం.

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఉద్యోగుల చేయూత

గరిడేపల్లి : మండల పరిధిలోని గారకుంటతండాకు చెందిన నిరుపేద దంపతులు గుగులోతు లకుపతి-చిన్నల కుమార్తె సింధు పెళ్లికి గ్రామంలోని పలువురు ప్రభుత్వ ఉద్యోగులు చేయూతనందించారు. ఆ కుటుంబానికి రూ.20వేల విలువ గల కిరాణా సరుకులు, 100కేజీల బియ్యం, కుటుంబ సభ్యులకు పట్టు వస్త్రాలు అందజేశారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా నిరుపేదలకు మా సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని ప్రభుత్వ ఉద్యోగులు భరోసా కల్పించారు. కేవలం వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ చూసి సహాయ సహకారాలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులకు నిరుపేదల కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కవిత, హేమ్లానాయక్, సందీప్, నరేందర్, బాలు, కోటయ్య, హుస్సేని పాల్గొన్నారు.

పనులకు మోక్షమెప్పుడో..?

- నిలిచిన 'మన ఊరు- మన బడి' నిర్మాణాలు
- బిల్లులు రాక మధ్యలో వదిలేసిన కాంట్రాక్టర్లు
- పెండింగ్ పనులు పూర్తిచేయాలంటున్న ప్రజలు



పాలెఅన్నారం ప్రాథమిక పాఠశాలలో పిల్లర్ల దశలో నిలిచిన భవన నిర్మాణ పనులు



జెర్రిపోతులగూడెం ప్రాథమిక పాఠశాలలో మధ్యలో నిలిచిన పనులు

చిలుకూరు : ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరిచేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన మన ఊరు- మన బడి కార్యక్రమం నిలిచిపోయింది. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చేపట్టిన నూతన భవన నిర్మాణ పనులు బిల్లులు రాకపోవడంతో అర్ధాంతరంగా నిలిపివేశారు. చేసిన పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో మిగిలిన పనులు చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోయింది. మండలంలోని చిలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతన గదుల నిర్మాణ పనులు స్లాబ్ వరకు పూర్తి చేసి నిలిపివేశారు. అదే విధంగా పాలెఅన్నారం ప్రాథమిక పాఠశాలలో భవన నిర్మాణాలు పిల్లర్ల దశలో ఆగిపోయాయి. జెర్రిపోతులగూడెంలో 80శాతం పనులు పూర్తయ్యాయి. సీత్లాతండా ప్రాథమిక పాఠశాలలో గది నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు. రామాపురం అంబేద్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో స్లాబ్ వరకు పనులు పూర్తిచేసి బిల్లులు అందక కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేశారు. కొండాపురం ప్రాథమిక పాఠశాలలో గది నిర్మాణ పనులు బేస్‌మెంట్ లెవల్‌లోనే ఆగిపోయింది. బేతవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 90శాతం పనులు పూర్తి చేశారు. మండల వ్యాప్తంగా 10పాఠశాలలకు నిధులు మంజూరు కాగా, 7పాఠశాలలో కాంట్రాక్టర్‌లు టెండర్లు దక్కించుకుని పనులు ప్రారంభించారు. కాని వారికి సకాలంలో బిల్లులు అందకపోవడంతో వివిధ దశలలో పనులు నిలిపివేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలలో నిలిచిన మన ఊరు- మన బడి నూతన భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

పనులు నిలిచిన మాట వాస్తవమే



పాఠశాలలో నూతన గదుల నిర్మాణ పనులు నిలిచిన మాట వాస్తవమే. ఈ విషయంపై ప్రతి రోజు సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్నాము. నిలిచిన భవన నిర్మాణ పనుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి, ఉన్నత స్థాయి అధికారులు దృష్టికి తీసుకెళ్లాను. సాధ్యమైనంత త్వరగా నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చూసి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తాను.

– సలీమ్ షరీఫ్, ఎంఈఓ, చిలుకూరు

సవతితల్లి ప్రేమ చూపిస్తున్న ప్రభుత్వాలు



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

కోదాడరూరల్ : దేశంలో వ్యవసాయ కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు అన్నారు. గురువారం పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆవరణలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కెటాయింపులు, కనీస వేతన చట్టంపై నిర్వహించిన రౌంట్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో వ్యవసాయ కార్మికులకు ఒరిగేదిమిలేదని విమర్శించారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలతో కూలీలకు చేతినిండా పనిలేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులతో కూలీలకు ఏడాదికి 70రోజులు కూడా పనిదొరకడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో చెప్పినట్లుగా ప్రతి కూలీకి ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని ఆయన ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సమావేశంలో పలు పార్టీ, సంఘాల నాయకులు సోమపంగు జానయ్య, రెమిడాల జయరాజు, జుట్టుకొండ బసవయ్య, ఎం.ముత్యాలు, చాపల శ్రీను, బచ్చలకూర జార్జి, బత్తుల ఉపేందర్, మేదర లలిత, డాక్టర్ సూర్యనారాయణ, రాజునాయక్, రవినాయక్, నరసింహారావు, రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, గంధం పాండు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

మునగాల : మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు మానవత్వం చాటుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన గోపి అనే యువకుడు వివిధ కార్యాలలో వంటలు చేసేందుకు వెళ్లేవాడు. ఆరు నెలల క్రితం వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు అన్నం గిన్నె జారి కాలు మీద పడడంతో ఎడమకాలు విరిగింది. కుటుంబ సభ్యులు పట్టించుకోకపోవడంతో హైదరాబాద్‌లో కృత్రిమ కాలు పెట్టించుకునేందుకు బయలుదేరాడు. మార్గమధ్యలో మండల కేంద్రం వద్ద ఓ టీ దుకాణం ముందు కూర్చున్న గోపిని స్థానిక యువకులు వివరాలు అడిగారు. దీంతో గోపి తనకు కృత్రిమ కాలు పెట్టించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆర్థికసాయం కోరుతూ బయలుదేరానని తెలిపాడు. స్పందించిన యువకులు విరాళాలు సేకరించి అతడికి రూ.7వేలు అందజేశారు.

దాడికి పాల్పడిన పోలీసులను సస్పెండ్ చేయాలి



కోదాడరూరల్ : ధర్నా చేస్తున్న న్యాయవాదులు

కోదాడరూరల్ : జనగామ పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాద దంపతులపై దాడికి పాల్పడిన పోలీసులను సస్పెండ్ చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌ఆర్‌కె మూర్తి డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర బార్ అసోసియేషన్ పిలుపు మేరకు కోదాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాయకులు స్థానిక కోర్టు నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. మహిళ న్యాయవాది అని చూడకుండా పోలీసులు దాడిచేయడం దారుణమన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పలు చోట్ల న్యాయవాదులపై దాడులు జరిగాయని, అందుకు బాధ్యులైన పోలీసులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గట్ల నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల రాంరెడ్డి, కోదూరు వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, దొడ్డా శ్రీధర్, నాగుల్‌పాషా, నవీన్ తదితరులు ఉన్నారు.

నల్లరిబ్బన్లతో న్యాయవాదుల నిరసన



హుజూర్‌నగర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హుజూర్‌నగర్ : జనగామలో న్యాయవాద దంపతులపై టౌన్ సీఐ దాడిచేయడాన్ని ఖండిస్తూ రాష్ట్ర న్యాయవాద జేఏసీ పిలుపు మేరకు గురువారం స్థానిక న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తి డాక్టర్ శ్యాంశ్రీ, సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతిప్రసాద్‌కు వారు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జక్కుల వీరయ్య, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, వీజీకే మూర్తి, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, రాఘవరావు, డి.శ్రీనివాసరావు, కె.నాగార్జున, అంజయ్య, సురేష్, అంజయ్య, నాగేశ్వరరావు, మహేష్, వెంకటేష్, శంకర్, శ్రీను, విశ్వనాథం, శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం'



కోదాడరూరల్ : కుక్కలకు టీకాలు వేయిస్తున్న ఎంపీడీఓ రాంచందర్‌రావు



నేరేడుచర్లలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ ప్రకాశ్, తదితరులు

మఠంపల్లి : మండలంలోని వివిధ గ్రామాలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు గురువారం 4వ రోజు కొనసాగించారు. మండలంలోని కిందితండాలో పారిశుధ్య పనులు చేపట్టి వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అదే విధంగా మఠంపల్లి గురుకులంలో పారిశుధ్య పనులు చేపట్టి విద్యార్థులకు స్వచ్ఛదనం-పచ్చదనంపై అవగాహన కల్పించారు. అల్లీపురం, గుండ్లపల్లి, భీల్యానాయక్‌తండా, బాడవాతండా తదితర గ్రామాలలో డ్రెయినేజీలు శుభ్రం చేసే పనులు చేపట్టారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఉమాదేవి, క్రాంతివిజయ, నరేందర్‌రెడ్డి, గోపిరాజా, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు తదితరులున్నారు.

గరిడేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం గురువారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది అంగన్‌వాడీ, ఉపాధి సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. పశువైద్య శాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని కుక్కలకు వ్యాక్సిన్ వేయించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి నాగేశ్వర్‌రావు మాటాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మేకపోతుల సరిత, బిల్‌కలెక్టర్లు సూదిరెడ్డి నర్సిరెడ్డి, రావుల వెంకన్నగౌడ్, సతీష్, ఏఎన్‌ఎం అంజలి, ఆశావర్కర్లు ఉమా సైదమ్మ, అంజమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది మందమ్మ, ధనమ్మ, శ్రీలక్ష్మి, మేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో వనమహోత్సవం

నేరేడుచర్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలో వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్ పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆలక సరితసైదిరెడ్డి, కమిషనర్ అశోక్‌రెడ్డి, కౌన్సిలర్లు రణపంగ నాగయ్య, ఎస్‌కె బాషా, తాళ్లూరి సాయిరాం, కోదమగుండ్ల సరిత, బాణోతు లలిత, అధికారులు, ఆర్‌పీలు, పారిశుధ్య సిబ్బంది, తదితరులున్నారు.

కుక్కలకు టీకాలు వేయించాలి

కోదాడరూరల్ : గ్రామాల్లో తమ కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని ఎంపీడీఓ రాంచందర్‌రావు సూచించారు. గురువారం మండల పరిధిలోని చిమిర్యాల స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పనులను చేపట్టి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, పశువైద్య సిబ్బంది ఉన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సంతాపం



హుజూర్‌నగర్ : బుద్ధదేవ్ చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పిస్తున్న నాయకులు

నేరేడుచర్ల : పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పట్ల గురువారం సీపీఐ నాయకులు సంతాపం ప్రకటించారు. అనంతరం ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. 11ఏళ్లు సీఎంగా సేవలను అందించిన మహానేత భట్టాచార్య అని కొనియాడారు. ఆయన ఆకాల మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటన్నారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దూళిపాల ధనుంజయనాయుడు, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, మండల కార్యదర్శి సింహాద్రి, పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, రావుల సత్యం, ముత్యాలు, భాస్కర్, వెంకన్న, గోవిందు, వెంకట్, నరసమ్మ, భ్రమరాంబ ఉన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్య మృతి తీరనిలోటు

హుజూర్‌నగర్ : పశ్చిమబెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్య మృతి సీపీఎంకు తీరనిలోటని ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుద్ధదేవ్ చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. భట్టాచార్య సీఎంగా 2000నుంచి 2011వరకు పాలన అందించారన్నారు. సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడిగా పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డి.బ్రహ్మం, పి.హుస్సేన్, శీలం శ్రీను, వై.సోమయ్య, ఆర్.మురళి, వెంకన్న, రత్నం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



హుజూర్‌నగర్ రూరల్ : సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, నాయకులు



మునగాల : సమ్మెలో పాల్గొన్న జీపీ కార్మికులు

హుజూర్‌నగర్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులతో కలసి సమ్మె నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 34రోజులు సమ్మె చేస్తే అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు 15రోజుల్లో మీ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చి సమ్మెను విరమింపజేశారని, అయినా ఇప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కార్మికులు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించి, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి జీపీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేసి కనీస వేతనం ఇవ్వాలని, విధి నిర్వహణలో మృతి చెందిన వారికి రూ.10లక్షల నష్టపరిహారం అందించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీపీ కార్మి కుల సంఘం మండల అధ్యక్షుడు షేక్ హుసేన్‌మియా, కార్మికులు వెంకటరెడ్డి, కొండల్, యల్లమ్మ, నాగరాజు, సరిత, శ్రీనివాసరెడ్డి, అంజయ్య, రత్నం, కనకయ్య, కాటయ్య పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

కోదాడరూరల్ : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సోమపంగు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో లింగయ్య, బాబు, కుమారి, నరేష్, వెంకన్న, నాగమ్మ, షరీఫ్, ఉష తదితరులు ఉన్నారు.

మునగాల : రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం జీపీ కార్మికులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఒక్కరోజు సమ్మె చేపట్టారు. ఈ సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మండల పంచాయితీ అధికారి దార శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి బండారు గురవమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు వాసిమేకల వేంకటేశ్వర్లు, జీపీ వర్కర్స్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.నాగార్జున, మామిడి వెంకన్న, మండల నాయకులు డి.రవి, పి.నర్సయ్య, ఎన్.గోపిరెడ్డి, జె.బజార్, ఎస్.రామారావు పాల్గొన్నారు.

కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని సమ్మె

చిలుకూరు : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడారు. సమ్మెకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు కట్టికోల శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి తిరుగుమల్ల వెంకటేశ్వర్లు, బత్తిని నాగేంద్రబాబు, రఫీ, అంజి, శివ, ఉపేందర్, జాకీర్, వెంకటేశ్వరు పాల్గొన్నారు.

గరిడేపల్లి : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు సమ్మెను నిర్వహించారు. ఈ సమ్మెలో సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కె యాకూబ్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జీపీ వర్కర్స్ మండల అధ్యక్షులు కొండ సైదులు, రాజు, ఎర్ర సైదులు, నర్సిరెడ్డి, ముత్తయ్య, ఆర్ వెంకన్న, ఇషాక్, సీతమ్మ, నరేష్, వీరబాబు, నాగరాజు, వెంకటయ్య, శ్రావణ్ పాల్గొన్నారు.

మఠంపల్లి : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు (సీఐటీయూ యూనియన్ అనుబంధం) గురువారం గ్రామాల్లో విధులు బహిష్కరించి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఒకరోజు సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్‌రసూల్‌మియా, పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు భూక్యా సైదానాయక్, ఉపాధ్యక్షుడు మామిడి అంజయ్య, కార్యదర్శి వీరస్వామి, నాయకులు దేవదానం, కిట్టయ్య, మైసయ్య, సైదా పాల్గొన్నారు.

మేళ్లచెరువు : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ అస్గర్‌అలీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు, సాదు వెంకన్న, వెంకటి, సైదులు, వెంకటేశ్వర్లు, ఉప్పలమ్మ, సైదా, కిరణ్, ఆనందరావు, భూలక్ష్మి పాల్గొన్నారు.

మోతె : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల జిల్లా ఉపాధ్యక్షుడు చిట్యాల రవిచంద్ర, మండల అధ్యక్షుడు బొమ్మగాని వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు పొడపంగి లక్ష్మీనారాయణ, మహిళా ఉపాధ్యక్షురాలు కాంపాటి నాగమణి, నవిలే నాగరాజు, తిర్పతయ్య, పరశురాములు పాల్గొన్నారు.

దేశంలో మత విద్వేషాలు సృష్టిస్తున్న బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న సామ్యూల్‌సన్

మునగాల : దేశంలో బీజేపీ మతరాజకీయాలు చేస్తూ విద్వేషాలకు దారితీస్తుందని క్రిస్టియన్ మైనార్టీ మీడియా జిల్లా కన్వీనర్, కోదాడ నియోజకవర్గ పాస్టర్స్, ఫెలోషిప్ కోర్ కమిటీ చీఫ్ కోఆర్డినేటర్ జేజే.సమ్యూల్‌సన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ దేశంలో మత విద్వేషాలను సృష్టిస్తూ మైనార్టీలకు రక్షణ లేకుండా చేస్తుందని ఆరోపించారు. ప్రజాస్వామ్య, లౌకిక దేశంలో మత స్వేచ్ఛ ఉందనే విషయాన్ని బీజేపీ మరిచిపోయిందన్నారు. ముస్లిం మైనార్టీల మీద బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమని ఎద్దేవాచేశారు. వక్ఫ్‌బోర్డులో సవరణలకు తీసుకువచ్చిన చట్టాన్ని క్రిస్టియన్ మైనార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని ఆయన అన్నారు. సమావేశంలో ఎం.రాజేష్, జె.సామూయేలు, ఇ.ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న చైర్మన్ జక్కుల నరేందర్

హుజూర్‌నగర్ : ప్రభుత్వం మంజూరు చేస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ జక్కుల నరేందర్ అన్నారు. గురువారం హుజూర్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పాలకవర్గ సమావేశాన్ని పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ్యులు రుణాలు తీసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. రుణమాఫీ పొందిన రైతులు తిరిగి కొత్త రుణాలు పొందవచ్చని ఆయన తెలిపారు. కొత్తగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు మంజూరైన రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కొత్తగా దీర్ఘకాలిక (గొర్రెల) రుణం మంజూరైన రైతు జడ సత్యనారాయణకు రూ.8లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఐ.లక్ష్మి, డి.మల్లీశ్వరి, డి.బ్రహ్మం, కె.శ్రీనివాస్, కె.పద్మ, రాయల వెంకటేశ్వర్లు, కార్యదర్శి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాంబాబు మృతికి నివాళి

మునగాల : మండల కేంద్రానికి చెందిన ఎస్‌పీ రామకృష్ణ అలియాస్ రాంబాబు గత నెల 25న మండల పరిధిలోని తాడువాయి స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో గురువారం స్థానిక వాసవీభవన్‌లో 1978లో పదోతరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు అతడి సంతాపసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం రాంబాబు చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు వృథా

మునగాల : మండల పరిధిలోని గణపవరం శివారులో ఆర్ అండ్‌బీ రహదారి నిర్మాణంలో భాగంగా పనులు చేస్తుండగా గురువారం మిషన్ భగీరథ పైపు పగిలి నీరు వృథాగా పోతుంది. తక్షణమే సంబంధిత అధికారులు వృథా నీటిని అరికట్టాలని స్థానిక గ్రామస్తులు కోరుతున్నారు.



గణపవరం శివారులో పైప్ పగిలి వృథాగా పోతున్న నీరు

ఆశ్రమంలో రక్షాబంధన్

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఓం శాంతి బ్రహ్మకుమారీస్ ఆశ్రమంలో రక్షాబంధన్ వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రాఖీలు కట్టించుకున్నారు. కార్యక్రమంలో శకుంతల, ఉమామహేశ్వరి, శైలజ, జి.అనిల్, ప్రతాపరెడ్డి, విజయ్, భాస్కర్, నాగేశ్వరరావు, రాధిక, నాగమణి, రమ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, సరుకులు అందజేత

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన నిరుపేద మహిళ లక్ష్మికి వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో అమెరికాలో ఉంటున్న స్థానికులు పి.రజని-రవిచంద్ర వారి కుమారుడు పి.క్రిశాంత్ పుట్టినరోజు సందర్భంగా అందించిన 25కేజీల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులను గురువారం స్థానికులు టి.హరీష్, ప్రవళిక అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రామ్‌నరేష్, కౌన్సిలర్ కారింగుల విజయ, కృష్ణవేణి, వి.నిర్మల, పి.లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓను బదిలీ చేయాలని పంచాయతీ కార్యదర్శుల నిరసన



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం ఎంపీడీఓ పవన్‌కుమార్‌ను బదిలీ చేయాలని కోరుతూ పలువురు పంచాయతీ కార్యదర్శులు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమను ఎంపీడీఓ మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు. దీంతో తాము ఉద్యోగం చేయలేక పోతున్నామని తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి ఎంపీడీఓపై విచారణ చేసి బదిలీ చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులకు కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, దాదాబుడే, నర్సింహారెడ్డి, ఉస్మాన్, తదితరులు మద్దతు పలికారు.